అనిర్వచనీయ బాంధవ్యం

శ్రీమతి కోమలాదేవి

> ఈ కథకు ఒక విచిత్రమైన విషయం ఇతివృత్తం. ఇది అపూర్వంగా కన్పించవచ్చు. కాని అటువంటిది జరుగవచ్చునని ఒక సైంటిఫిక్ జర్నల్ లో చదివాను. అనంతరం ఊహించి వ్రాయబడిన కథ ఇది.

"క్రేర్" మన్నకేకవిని సావిత్రి శ్రమనంతా మరచిపోయింది. ఆయాసపడుతలూ కళ్ళు ప్రక్కకు త్రిప్పింది....ఆయా పాపనుతుడుస్తోంది.....

'ఏం పాప? బాగుందా?'

అత్యాతురతతో ప్రశ్నించింది.

'అబ్బాయి....బాగున్నాడమ్మా'

ఫరవాలేదు...తన శ్రమ ఫలించింది. తన బాధ్యతను నెరవేర్చింది. అలసట తీరలేదు. ప్రాణం సొమ్మసిల్లి పోయింది. క్షణం కళ్ళుమూసుకుంది...ఎన్ని క్షణాలు గతించి పోయాయో! మగతగా వుంది!

'అమ్మా పిల్లాడిని చూస్తారా?'

సావిత్రి కళ్ళుతెరచింది. అబ్బాయిని చూస్తోంది. చిక్కని నల్లని తలవెంట్రుకలు--గులాబి రంగులు ముద్దులొల్కే చిన్నముఖము, బుల్లి ఎఱని పెదిమలు—ముద్దులు మూటగట్టే ఆ పాపడిని చూస్తూ--మృదువుగా స్పృశించిందామె. బిడ్డ ఆమె వ్రేలుపట్టుకుని వదల్లేదు. ఆ పట్టు ఆమె హృదయాన్ని గట్టిగా పట్టేంది....

'అబ్బాయేడీ' అన్న కంఠం విని సావిత్రి నిస్త్రాణతో చూచింది. ఆమె పద్మ! గతుక్కుమన్నది. శిలా ప్రతిమయై తదేకంగా చూస్తోంది...గబగబ వచ్చిందామె.

గులాబివన్నెముఖంలో ఆనందవీచికలు పరిభ్రమిస్తున్నాయి. ఆ రెండు కళ్ళు రెండు జ్యోతులై దేన్నో వెదకుతున్నాయి! ఆమె సావిత్రిని చూడలేదు. స్ఫటికఫలకంలాంటి నుదుటిపై ఆందోళన వ్యక్తంచేసే చారలు. ఎంతైనా ఆమె ఆనందానికే పర్యాయపదం!

'ఇక్కడమ్మా' అంటూ పొత్తిళ్ళలో పాపను పద్మ కందించబోయింది.

పద్మ బాబు ముఖంలోకి వంగిచూచింది. జరీ పూలుకుట్టిన నీలం నైలాన్ పమిట సర్దుకుని బిడ్డను అందుకోబోయింది.

సావిత్రి హృదయం కంపించిపోయింది.

కళ్ళు తప్పించి వేసింది.

కళ్ళు తెఱచి చూచేసరికి—పద్మ—ఆ పాపడిని తన హృదయానికి హత్తుకుని అనిర్వచనీయమైన ఆనందం పొందుతోంది. ఆ సుందరవదనంలోని సంతృప్తి భగవత్ సృష్టిలోని తృప్తికి సరితూగిపోతోంది...

సావిత్రి హృదయం విలవిల్లాడిపోయింది.

'చిన్నితండ్రీ ..... బంగారునాన్నా !.....ఇంటికి వెడదామా? పద నాన్నగారిని చూద్దువుగాని...

సావిత్రి కంఠంలోని మాటలు కంఠంలోనే పూడుకుపోయాయి. మూగగా రోదిస్తూ—మూగగా 'వద్దు...వద్దు' అంటోంది. ఆమెను వినే దిక్కు లేదు. ఉడిగిపోయిన శక్తితో నిర్జీవంగా పడుకుండిపోయింది. ఆమెను ప్రైవేట్ రూమ్‌లోకి తీసుకువెళ్లి పండుకోబెట్టారు.

ఎప్పుడో మెలకువ వచ్చింది. తన ప్రక్కలో ఊయల లేదు.

అప్పుడే నర్స్ వచ్చింది.

ఏమి జవాబు వింటానో—అన్న సంశయంతో—గుండెలు చిక్కబట్టుకొని అడిగింది.

'పాపడు...?'

'ఆమె తీసుకువెళ్ళిపోయారు...ఈ సాయంత్రం వస్తారట...'

సావిత్రి దుఃఖం కట్టలు త్రెంచుకుంది. ఒక్కసారి బిడ్డను కళ్ళారా చూడలేదు. ఆ పాలబుగ్గల్ని చిదిమి ముద్దాడలేదు. ఆ పట్టు దారాల్లాంటి జుత్తును మృదువుగా సవరించలేదు. ఆ చిన్నారి పెదిమలపై తన అమృత ధారలు చిలికించలేదు. తనివి తీర ఒక్కసారి తన హృదయానికి హత్తుకోలేదు... చెవులారా ఆగయ్యాళిఏడ్పు వినలేదు — ఒక్కసారి

తృప్తిగా సాంబ్రాణి ధూపం వెయ్యలేదు...ఆమెచెక్కిళ్ళు కన్నీటితో తడిసిపోతున్నాయి. నర్స్ జాలిగా చూచింది — ఓదార్పుగా నాల్గుమాటలని వెళ్ళిపోవటాని కుద్యుక్తురాలైంది.

సావిత్రి తమాయించుకుంది. 'ఒక్కసారి డాక్టర్ ముకుందరావును—అతని సతీమణిని రమ్మని చెప్పండి'

ఆమె వెళ్ళిన పది నిమిషాలకు వారిద్దరు స్మాక్స్ వేసుకుని స్టెతస్కోప్‌లు పట్టుకుని వచ్చారు.

సావిత్రి గంభీరంగా చూస్తోంది.

'ఏం — సావిత్రీ! బాగుందా' ఒంట్లో'

ఆమె పేలవంగా నవ్వింది. 'వంట్లో బాగానే వుంది— మదిలో అంతా వ్యథ'

'ఎందుకు?'

'డాక్టర్—మీరు చెప్పండి- ఆడవాళ్ల కర్థ వౌతుంది. నా హృదయం ఎందుకు తరుక్కుపోతోంది?...బిడ్డపుట్టాడు—నేను ఒక్కరోజు కనీసం ఒక్కగంటైన వాడితో గడపలేదు—అప్పుడే వాకు ఎడబాటు...డాక్టర్...ఇలా జరుగుతుందని...ఈ క్షణం ఇంత భరింపరానిదౌతుందని ఆ నాడు ఆలోచించలేదు. మీరు...అన్నీ ఎరిగిన మీరిదరుకూడ వాకు తెలియ జెప్పలేదు...నేను ప్రాణంలేనివస్తువునుగాను...మనిషిని .. హృదయంగల మీలాంటిదాన్ని...

ఆమె కొంగు కప్పుకుని హృదయవిదారకంగా రోదించింది.

భార్యాభర్తలు మౌనంగా ఒకరి ముఖాలొకరు చూచుకొన్నారు...నిజమే...ఇది భరింపరాని బాధ... తాముకూడ వూహించలేదు! పద్మ తీసుకువెడతానంటే ఒప్పేసుకున్నారు...వారి హృదయాలెంత పాషాణాలు... ఆమె సజలనేత్రాలను తుడుచుకుంటూ సావిత్రిని ఓదార్చింది...

'సావిత్రీ...క్షమించు...వివేచనాజ్ఞానంతో చేయ లేదమ్మా...క్షమించరాని నేరం చేశాము. ఇప్పుడేవెళ్లి నేనే స్వయంగా తెస్తాను...నీ మురిపెం తీరిన తర్వాత వాడికోసం...వాడి భవిష్యత్తుకోసం...వాడిని వాళ్లకు అప్పగించు...వస్తామరి']

* * *

కన్న బిడ్డను తెస్తారు- తను చూడబోతోంది.

ఆనందాతిరేకంతో కళ్ళు మూతలుపడినై. ఆమె గతంలోకి దిగజారిపోయింది.

ఆ నాడు సంధ్య దాటింది. భర్త ఇల్లు చేర లేదు. అత్యంత నిరీక్షణతో కనిపెట్టుకుని వుంది.

స్నేహితురాలు శ్యామల హడావిడిగా వచ్చింది.

ఆమె గుండెలు ఝల్లుమన్నాయి. మెల్లగా చెప్పింది...'మీ వారికి...ఆక్సిడెంట్ అయింది.'

తర్వాత అంతా అంధకారం. ఆ నాటి ఆక్సిడెంట్ ఫలితం తన భర్తకు ఉద్యోగం పోయింది. ముగ్గురు పిల్లలు—తను—తన భర్త- త్రాగాలి— తినాలి—కట్టాలి —వుండాలి. ఎలా సాధ్యం - తను సెకండ్‌ఫార్మ్ చదివింది. కనీసం విద్యాబోధ చేయ లేదు. తమకు ఏమీ లేదు. ఒక్కసారి నాలుగువందల ఆదాయం తగ్గిపోయింది.నలభై రూపాయల రాబడితో— తను ఇంతమంది నెలా పోషించగలదు?

దినాలు గడుస్తున్నాయి. బ్రతుకు భారమైంది. పిల్లలు బడికి వెడుతున్నారు. వారి అవసరాలధిక వౌతున్నాయి.

పేపర్‌లో చిన్న అడ్వర్‌టైజ్‌మెంట్.

'ఆరోగ్యంగావున్న స్త్రీలు—ముప్పై సంవత్స రాల లోపువారు—ఫలానా బాక్స్‌నంబరుకు వ్రాయవలసి నది — మంచి ఉద్యోగం దొరకగలదు. చదువు ప్రమేయం లేదు'.

సావిత్రి జాగుచెయ్యలేదు.

అనుమానంగానే ఉత్తరం రాసింది.

డాక్టర్—ముకుందరావు — అతని అర్ధాంగి రమణి—జబాబు వ్రాశారు.

ఆ నాడు తాను వెళ్లింది. తనతోపాటు ఇంకా ఎనిమిదిమంది స్త్రీలుకూడ వున్నారు. ఏమిటి పని? ఏం చెయ్యాలి? ఎలాంటి ఉద్యోగం? ఎంత ఇస్తారు? తన సంసారం నడవగలదా?

ఆ తొమ్మిదిమందిలో నలుగురు సరిపోలేదు. వాళ్లు వెళ్లిపోయారు.ఇంకా నలుగురు మిగిలిపోయారు.

తమ పని తెల్పేసరికి వాళ్లు నిర్ఘాంత పోయారు.

ఇది సాధ్యమా?

తాను చేయగలదా?

రమణి ఏమన్నది? 'మీ ఆరోగ్యం తొంభై తొమ్మిదిపాళ్లు సరిగా వుంది. మీ పని అత్యంత క్లిష్టమైనది. ఈ ప్రాంతాల్లో మీరు మొదటి వారౌతారు...ఆరునెలలు మీకు ఏ కొదువా వుండదు. ఆ తర్వాత మీ శ్రమకు తాహతునుబట్టి కొన్నివేలు ఇస్తారు...'

ఆమె మౌనం దాల్చింది. ఆమె ముఖంలో ఏవో నీడలు కదిలిపోతున్నాయి.

'మా పని ఏమిటి డాక్టర్? ఏం చెయ్యాలి?'

రమణి వారి కళ్ళను తప్పుకుంది. శూన్యం లోకిచూస్తూ మెల్లగా అంది: 'మీ...మీ గర్భాలను అరువు కివ్వాలి'

ఒక్కసారి నలుగురు 'డాక్టర్' అని నిర్ఘాంత పోయి గ్రుడ్లప్పగించి చూస్తుండిపోయారు.

కడుపు దేవినట్లైంది-ఏదో అసహ్యం—కోపం—వినరానిది విన్నట్లు బాధ—జుగుప్స—దుఃఖం మిళితమై వారి నోర్లు కట్టివేయబడినై.

రమణి ఒక్కొక్కరి దెస మార్చి మార్చి చూచింది.

'ఔను...మీ గర్భాన్ని అదె కివ్వాలి...అంతే మీ గర్భపుసంచిని మాత్రం అద్దె కివ్వాలి...అంతే.' ఆమె లేచి వెళ్లిపోయింది.

ఆ గదిలో నిశి పులుముకుంది. పాతాళంలో దిగ జారిపోయినట్లు నిస్త్రాణతో కూర్చున్నారు...ఇదా వారి పని...ఇందుకా అంతఆత్రంతో వచ్చారు. ఒకరినొకరు చూచుకోవటానికి కూడా సిగ్గుపడ్డారు.

రమణి తిరిగివచ్చేసరికి సావిత్రి మరొకామె మాత్రం మిగిలారు.

రమణి వారిదగ్గరకు వచ్చింది.

'మన కింకా అలవాటు లేదు...అందుకని క్రొత్తగా వుంటుంది...కొన్నాళ్లు గడిచిపోయినతరువాత అందరికీ మామూలైపోతుంది సుమా!'

మరుసటిరోజు తాను రమణి ఇంటికి వెళ్లింది.

ఆ గదిలో పద్మ కూర్చునివుంది. ఆమె ముఖం పాలిపోయి కళావిహీనంగావుంది. చెక్కిళ్లు పాలరాతిలా వెలవెలబోతున్నాయి. ఆ విశాలనయనాల్లో జీవం లేదు. దీప్తిలేదు. పెద్ద జబ్బుపడి అప్పుడప్పుడే కోలుకుంటున్నదిలా వుంది. ఆమె ఉచ్ఛ్వాసనిశ్వాసాలు అతి కష్టంతో జరుపుతున్నట్లుంది. చేతికి వేసుకున్న రాళ్లగాజులు మోచేతివరకు జారుతున్నాయి. ముక్కు స్పష్టమై పొడుచుకువచ్చింది. కళ్లు జానెడలోతుకు పోయి పూడిపోయినట్లున్నాయి. పెదిమలు ఆరిపోయి పొడిగా వున్నై. అయితేనేం—ఆమె అందమైంది.

ఆమె శ్రీమంతుల బిడ్డ.

సావిత్రిని పరిశీలనగా చూస్తోందామె.

సావిత్రి సాధారణమైన వ్యక్తి—ఆమెకు పద్మకు లేని ఐశ్వర్యం వుంది. అది—ఆరోగ్యం...అందుకని సావిత్రి గర్వించవచ్చు.

'వీరు—సావిత్రి...'అంటూ తనను గూర్చిన విషయాలన్నీ రమణి చెప్పింది.

పద్మ ఆయాసపడుతూ విన్నది.

'చూడండి సావిత్రీ! వీరు శ్రీమతి పద్మగారు. రంగనాథరావుగారి కోడలు. వారు వ్యాపారస్థులు. మీకు తెలుసనుకుంటాను. ఎన్నోచోట్ల షేర్లున్నాయి. ఒక్కడే కొడుకు. వారు తండ్రిగారికి చేదోడు వాదోడుగా వుండి వ్యాపార విషయాలన్నీ చూచుకుంటారు. వీరికి పెళ్లయి రెండు సంవత్సరాలు దాటినై. ఇప్పుడు గర్భవతిగా వున్నారు. పద్మగారికి పోయిన సంవత్సరంవరకు ఆరోగ్యం బాగున్నదిగానీ ఈ సంవత్సరం చాల జబ్బుపడ్డారు. డబుల్ న్యుమోనియా వచ్చింది—తర్వాత యూరిన్ ట్రబుల్...కాస్త కోలుకుంటున్న సమయంలో గర్భవతియైంది. వేవిళ్లు...మళ్లీ ఆరోగ్యం దెబ్బతిన్నది...అంతేకాదు ఆమె గర్భకోశం పిండాన్ని భరించలేదు. నాలుగైదునెలలకు విసర్జిస్తుంది...'

సావిత్రికి అర్థం కాలేదు.

'డాక్టర్‌గారూ—స్వకీయమైన అనుభూతితో ఏదో పల్కుతున్నారు. విశదీకరించండే పామరులం మాకేమీ అర్థం కాదు.'

రమణి రమణీయంగా నవ్వుతోంది.

'నిజమే....సావిత్రీ...ఒక్కమాట...అంత గొప్ప కుటుంబానికి భగవంతుడు ఒక్కటి—ముఖ్యమైన ఒక్కటి లోపంచేశాడు...సంతానంలేమి'.

'పద్మగారు గర్భవతి కాదా? మీరు శ్రద్ధ వహిస్తే సరిపోదా?'. సాలోచనగా అంది.

'లేదు...ముందర తెలియజేశాను. ఆమెకు బిడ్డను తనలో పెట్టుకునే శక్తి లేదు. నవమాసాలు భరించే బలం ఆమెలో లేదు. స్త్రీలకు అంతర్గతమైన ఈ శక్తి ఆమెలో లోపించింది. శస్త్ర చికిత్స...మందులు పనికిరావు. పసిపిండె రాలిపోయినట్లు—విరియని మొగ్గ రాలిపోయినట్లు...మానసికావేదనతో ఈ దంపతులు రానున్న పరిస్థితికి—ఆపదకు లొంగలేక అధైర్యంతో మా సలహా కోరారు...' రమణి సావిత్రికి దగ్గరగా వచ్చింది.

'ఆ సహాయం నువ్వు చేయాలి సావిత్రీ... చెప్పానుకదూ? పద్మ గర్భవతి. ఆమెలో ఇక పిండం వృద్ధి చెందలేదు...శస్త్ర చికిత్సతో ఆ పిండం తీసి మరొక గర్భంలో పదిల పరచాలి...'

'డాక్టర్...ఇది సాధ్యమా?' సావిత్రి విస్తుపోయింది.

రమణి నవ్వింది 'సాధ్యమే. చాలా చోట్ల ప్రయత్నించి సఫలులయ్యారు. మేము తర్ఫీదు పొందాము. ఆమె గర్భంలోంచి తీసి దాన్ని నీ గర్భంలో భద్రపరుస్తాము. మిగిలిన మాసాలు బిడ్డ నీలో పెరుగుతుంది. తర్వాత...'

'తరువాత...ప్రసవవేదన?...'

'ఆ...పడాలి...ఇక మామూలే...నీవు ప్రసవిస్తావు. బిడ్డను వాళ్లు తీసుకుంటారు...ఒక్కమాట చెప్పనీ...బిడ్డ ఆరోగ్యంగా పుడతాడు. బలహీనత లేమీ వుండవు. వాడు స్వయాన వాళ్ళమ్మ నాన్న సుపుత్రుడు. నీవు పెంచిన తల్లివి...అంతే...'

సావిత్రి అరచేతుల్లో ముఖం దాచుకుంది.

కడుపులో కదిలినట్లయింది. అప్రయత్నంగా గర్భంమీద చేయివేసింది. తనకు పిల్లలున్నారు... నవమాసాలుమోసి—కని—పెంచుతోంది. దానికి—దీనికి భేదం? కొన్నిమాసాలుమోసి—కనాలి—ఔనా... కనాలి...మోయవచ్చు...కానీ కనటం?...ఆ భరింప శక్యంకాని బాధ—సృష్టి యావత్తులో నొప్పికిపర్యాయ పదం ప్రసవ సమయంలో నొప్పులుకాదా?...ఆ బాధను మరిపిస్తూ చిన్నారిపాపడి ఏడ్పు—ఎంత మధురమైన శబ్దమది—ఆ ఏడ్పులో తల్లి తన బాధను విస్మరిస్తుంది...మరి...అయితే!...

'నాకు చేతకాదు—నేను చేయలేను — నన్ను క్షమించండి.' సావిత్రి దృఢంగా—పరితప్త హృదయంతో ఒక్కొక్కమాట అన్నది.

పద్మ ముఖం నిరాశతో పరిదీనం అయిపోయింది. కనుబొమలు ఆవేదనతో వంపు దిరిగాయి.

రమణి సావిత్రి భుజంమీద చేయివేసింది... ఓదార్పుగా—చెబుతోంది.

'ఒక్కసారి దీర్ఘంగా ఆలోచించుకో...ఈమెకు—పద్మకు—నవమాసాలు మోసే శక్తిలేదు. అది ఆమె పొరపాటు కాదు. భగవదేచ్ఛ. ఆమె గర్భంలో స్థలం లేదు సావిత్రీ! ఆ వరం నీకుంది...కొంత త్యాగం అవసరం...పిల్లలుంటేనే తల్లిశబ్దానికర్థం వుందనుకోకు...స్త్రీ...ఆ ఒక్కశబ్దం చాలు మాతృత్వాన్ని పునీతం చేయటానికి. స్త్రీ—ఆమె మాతృమూర్తి. అడ్డాలలోపాప—ఊయలదిగీ దిగక ముందే—తక్షణం చిన్నబొమ్మకు నీళ్లుపోసి—పాలుబోసి జోలపాడి నిద్రబుచ్చుతుంది...ఆ పసిబిడ్డకు తను చేస్తున్న కార్యంలో అసాధారణత ఏమీ కనిపించదు. అది పుట్టుకతోనే స్వభావసిద్ధమైంది. పిల్లవాడిని చూడు—బొమ్మనిస్తే దాని ముఖం చూడడు. ఏదో ఒక ఆటవస్తువుగా జమకట్టి ఆడినంతసేపు ఆడి ప్రక్కకు త్రోసేస్తాడు. కానీ ఆడపిల్ల—ఆ ప్రాణంలేని బొమ్మ తన పాప. అదొహ లోకంలో విహరిస్తుంది. ఆ బొమ్మకు తను తల్లి. ఆ కోరిక రానురాను నిజవౌతుంది. తను తల్లి అవుతుంది. తన చేతులలో పెంచి పెద్ద జేస్తుంది...ఈ దశకు వచ్చినప్పుడు ఆ కోరికలు—ఆశలు పేకమేడల్లా కూలిపోతే ఆమె దుఃఖం—ఆమె క్షోభ భరింపనలవికాదుగదా? తన గర్భంలో పాప ఒక్కనాటికీ ప్రాణాలతో బైటికిరాదు. చిన్నతనంలో బొమ్మలతో గడిపిన మధురక్షణాలు ఒక్కనాటికి నిజం కాలేవు. తనపాపను ఎత్తుకుని ముద్దాడ లేదు. శూన్యగర్భమైనా—గొడ్డాలైనా—అది వేరు. కానీ...సావిత్రీ...ఈ బాధ యమయాతనకాదా? తన

కడుపులో పాప, పెరిగి పెద్దదై, ప్రాణాలతో ఈ గడ్డమీద పడి పెరిగి పెద్దవాడై తన జీవితాన్ని సఫలం చేస్తాడన్న కోర్కె మొదలంటా తెగి నేల కొరిగిపోతే ... ఏంచేస్తాము ... ఈ మనఃక్షోభనించి రక్షించలేమా? ఈమెకు ఇది తప్పించలేమా? ఆలోచించు—నీ వంగీకరిస్తే — ఇదెంత ఉదీప్తమైనదో నీకే తెలుస్తుంది. ఒకరి ఆనందంకోసం నీవెంత త్యాగం చేస్తున్నది అవగాహనం కాగలదు...నీవు అన్ని విధాలా తగినదానవు...ఆలోచించుకో...మీవారికి చెప్పటానికి డాక్టరుగారు—పద్మగారి శ్రీవారు వెళ్ళారు...'

సావిత్రి గట్టిగా కళ్ళు మూసుకుంది.

శూన్యం—అంతా శూన్యం — హృదయంలో అంధకారం.

పద్మ ఆమెకు దగ్గరగావచ్చి కూచుంది. గాద్గదికంతో మెల్లగా అంది. 'మీ అంగీకారంకోసం ప్రాణాలు బిగబట్టికొని నిరీక్షిస్తున్నాను...ముందు...ఇదరు...ఒప్పుకోలేదు......నన్ను నిరాశపరచకండి...మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను...ఎందుకో మిమ్మల్ని చూచిన తక్షణం, నా బిడ్డకు సరియైన పోషణ మీ గర్భం ప్రసాదించగలదన్న నమ్మకం నాలో కల్గింది...అనుగ్రహించండి...' ఆమె మాటాడలేక ఖేదంతో నీరు నిండిన రెప్పలదిమి కన్నీరు కారుస్తూ కూచుంది.

సావిత్రి నిలువెల్ల కంపించింది.

ఆమెను ఆ విధంగా చూస్తుంటే హృదయం తరుక్కుపోతోంది.

ఆమె చటుక్కున లేచింది.

'మావారిని...అడిగి...రేపు చెబుతాను.'

రమణికూడ లేచింది.

'మీవారు అంగీకరిస్తారు. ఇంట్లో సహాయానికి మనిషిని ఏర్పాటు చేస్తారు......ఎల్లుండి......పాపను మారుస్తాము.'

* * *

సావిత్రి కళ్ళు తెఱచింది.

తన మంచంప్రక్కలో నీలంరంగుతెర.

తనకు మత్తుగా వుంది...ఏం జరిగింది? మెల్లగా చేతిని గర్భంమీదికి పోనిచ్చింది...బేండేజి—ఆమె ముఖంలో ఆనందం తళుక్కుమన్నది.

తను గర్భవతి—కాదు...కాదు...ఎవరి పాపనో పెంచుతోంది.

రమణి గబగబ తెర తొలగించుకుని వచ్చింది.

'సావిత్రీ—ఎలా వుంది?...భద్రంగా పెంచాలి సుమా!'

సావిత్రి నవ్వింది—

'నొప్పి—మందు ఏదైనా?'

'ఆ...తప్పకుండా' అన్నది. ఏదో ఇచ్చింది. మత్తుమందులు వాడితే పిండానికి ముప్పు అని చెప్పలేదు. సైకలాజికల్‌గా సావిత్రి బాధను భరించగల్గింది.

ఆమె భర్త క్రచ్చస్ టకటక లాడిస్తూ వచ్చాడు.

సావిత్రి కన్నీరు నింపుకుంది. అతను ఊరడింపుగా ఆమె కన్నీరు తుడిచి మెల్లగా చెవిలో అన్నాడు.

'సావిత్రీ— నీ బాధ వృధా కాలేదు—ఇలాంటి పరిస్థితి కల్పించిన నన్ను క్షమించవూ? ఇదిగో...ఇప్పుడే రెండువేలు చెక్కు రాసిచ్చారు. ఇంటి అదె బాకీ—దుకాణంలో బాకీ తీర్చేస్తాను. రేపు మిగతా విషయాలు మాట్లాడుకుందాము...విశ్రాంతి తీసుకో...'

సావిత్రి నిర్జీవమైన నవ్వు నవ్వింది.

'ఈ పిండం విలువ ఇప్పుడు రెండువేలు.'

అతను నవ్వేశాడు.

కొన్నిరోజులు దొర్లిపోయాయి.

పాప కదిలింది. ఆమెకు తెలుసు. వారం గతించిపోయింది.

డాక్టర్ రమణి— పద్మ సావిత్రి ఇంటికివెళ్ళారు.

రమణి పరీక్ష చేసింది.

'అంతా సవ్యంగా వుంది. పాప తిరుగుతోందా?'

సావిత్రి జవాబిచ్చింది. 'డాక్టర్‌గారు చాల సంతోషిస్తారు. ఆపరేషన్ విజయవంతమైందని.'

పద్మ వెఱుతూ ఐదువందలు చేతిలో పెట్టింది.

'మీరు మంచిభోజనం తీసుకోవాలి. ముఖం తీసిపోయినట్లుంది.'

సావిత్రి గ్రుడ్లప్పగించి చూస్తోంది.

పద్మ అటు వెళ్ళగనే తన ప్రతిబింబాన్ని చూచుకుంది.

ముఖం నిండుగా హుందాగా కనబడింది. మునుపటికన్నా ఆరోగ్యంగావుంది. మరి ఆమె మాటల్లో అంతరార్థం?

ఆ రోజునించీ పద్మ రోజూవచ్చి చూచిపోయేది. ఆమెను చూడనంతసేపు— తను దినచర్యలో మునిగిపోయి తన విషయం తనకు మామూలుగా అనిపించేది. పద్మను చూచిన తక్షణం తన గర్భంలో పాప తనది కాదే అన్న భావం ఆమెను కృంగదీసేది.

పద్మవచ్చి కూచుంది. సావిత్రి హడావిడిగా వచ్చింది. సాధారణంగా స్నేహితులతో చెప్పుకున్నట్లుగా అంది: 'అబ్బ— కాస్త తీరికకూడా వుండటం లేదు. పిల్లలకు పరీక్షలు. తెల్లవారి లేచినప్పటినుంచి పడుకునేవఱకు ఏవో పనులు...'

పద్మముఖం చిటపటలాడింది.

సావిత్రికి గుర్తొచ్చింది. మౌనంగా గంభీరంగా కూర్చుంది.

'మీా రింతపని చేయకూడదనుకుంటాను... ఏమంటారు? బిడ్డలేమైనా...'

సావిత్రి విరగబడి నవ్వింది.

'ఇంకా నయం— మంచంమీాద కాళ్ళుచాపుకుని కూర్చోమన్నారుకారు···వారు ఉద్యోగంలో వున్నప్పుడు నాకింతకు రెండంతలు పని వుండేది····ముగ్గుర్ని కన్నాను...నాకు తలిదండ్రులు— ఎవ్వరు లేనందున ఎక్కడికి వెళ్లేదాన్నిగాను. ఆసుపత్రికివెళ్ళి వచ్చేదాన్ని...ఈ పనికి పాపకే అపాయం రాదు...మీారు బలహీనులు. అందుకే బరువు పనులు నిషేధం— నాకెందుకు?'

పద్మకీ సంయమము నచ్చలేదు.

'మీా రింతపనిచేస్తూ అలసిపోవడం సుతరామూ నా కిష్టంలేదు.'

సావిత్రి పగలబడి నవ్వింది. ఆ నవ్వులో క్రోధం మిళితమై వుంది.

'మరేం చెయ్యమంటారు. మీా రిచ్చేడబ్బుతో ముప్పూటలా తిని హాయిగా విశ్రమించమంటారా?'

'ఔను. అదే నేనూ చెప్పబోతున్నాను...'

'చాలా మంచి సలహా పద్మగారూ··· మీకు తెలీదు....బిడ్డ పెరిగి పెరిగి...చివరికి బైటికి రాలేకపోతే మా యిద్దరికీ...'

ఆమె గుటకలు మ్రింగింది.

'మీాకు అర్థం కాదు. డాక్టర్‌ను అడగండి'.

సావిత్రి నుదురు తుడుచుకుంటూ నిట్టూర్చింది.

'పోనీ·· మీారు యింట్లో వుండండి...కావలసినంత వ్యాయామంమాత్రం తీసుకోవచ్చు...లేనిపోని బాధ్యతలుండవు.' సావిత్రి శిలాప్రతిమయై కలవరపాటుతో చూస్తోంది.

'మరి...మరి...నా భర్త— నా సంసారం ·· నా పిల్లలు...'

'డబ్బిస్తానుగా...మంచి పనిమనిషిని పెట్టిస్తే సరిపోతుంది.'

సావిత్రి కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

'తల్లికి— భార్యకు సాటి— ఏమీా— ఎవరూ— లేరు...' ఆమె మాట్లాడలేక నిశ్శబ్దంగా ఏడుస్తూ కూచుంది.

'మీారు దుఃఖించరాదు...బిడకు...'

సావిత్రి ఇక భరించలేకపోయింది.

'నాకు తెలుసు...బిడ్డ నాలోవుంది... నా కంతా తెలుసు— ఈ రోజుకు మీారు దయతో వెళ్లిపొండి.' సావిత్రి చటుక్కున లేచి వెళ్ళిపోయింది.

కొంతసేపటికి రమణి వచ్చింది.

'ఏం జరిగింది...' ఆత్యాతురతతో ప్రశ్నించింది.

సావిత్రి దుఃఖం పెల్లుబికింది... 'నే నెంతో పొరపాటు చేశాను... నా గర్భాన్ని భరించి ఎంత దిగజారి అధోగతి పాలయ్యానో ... డాక్టరుగారూ... ఈ బాధ భరించలేను...'

'ఏం జరిగింది...నీ నోట వినాలనివుంది.'

జరిగినదంతా చెప్పింది సావిత్రి. 'నేను ఇంటిపని చేసుకోరాదు. తిని త్రాగి కాలుమీద కాలు వేసుకుని ఆనందించాలి. నా భర్తను, నా బిడ్డల్ని, నా సంసారాన్ని... వదిలిపెట్టి...' బోరున ఏడ్చింది సావిత్రి. రమణి ఆమెను పొదివిపట్టుకుంది. సజలనేత్రాలను కొంగుతో తుడుచుకుంది ... 'పద్మ ఇంత ఇదిగా

ప్రవర్తిస్తుందని అనుకోలేదు... నీకు నాలుగవ గర్భంలా వుంటుందని—అంత సాధారణంగా కొన్ని నెలలు గడిచిపోతాయని—నీ ఇంట్లో—నీకు అనుకూలమైన వాతావరణంలో బిడ్డ పెరుగుతాడని ఆశించి ఆ విధంగా జరుగుతుందని విశ్వసించానుగానీ ... పద్మ ఇంత మూర్ఖంగా...ఒక అమూల్యమైన మనిషిని తూచితూచి విలువకట్టి తేలికగా మాట్లాడుతుందని కలలోకూడ అనుకోలేదు. ఒక వస్తువును అద్దెకు తీసుకుని మన ఇచ్ఛానుసారం వాడుకున్నట్లు—అంత తేలికగా అభిప్రాయపడింది ... అదేవిధంగా మాట్లాడుతోంది... ఇకపై ఆమె రోజూ రాకుండా చేస్తాను. నిశ్చింతగా వుండు.'

రమణి వెళ్ళిపోయింది. మరి వారానికిగాని పద్మ రాలేదు. పండ్లు, పూలు, మిఠాయిలు సన్న బియ్యం తెచ్చింది.

సావిత్రి లోపల పెట్టేపెట్టకముందే పిల్లలు బడినించి వచ్చారు. గుడ్డలు మార్చుకుని తలో పండు తిన్నారు. మిఠాయిబుట్ట సగం ఖాళీ అయింది. గోల గోలగా అల్లరిపెడుతూ తింటున్నారు.

పద్మ ముఖం అదొహలా మారిపోయింది.

'అవి కేవలం మీకని తెచ్చాను...వాళ్ళంతా...'

సావిత్రి నవ్వింది. పద్మ కళ్ళలోకి నిశితంగా చూచింది. 'వాళ్ళు తిన్నారు. నా కడుపునిండిపోయింది... దీని అర్థం మీకు బోధపడదు పద్మగారూ...ఇకపై ఏది తెచ్చినా నా ఒక్కత్తికోసం తేకండి...'

పద్మ వెళ్ళిపోయింది. సావిత్రి భారంగా అడుగులు వేస్తూ లోపలికి వెళ్ళింది. పెద్దవాడు పరుగెత్తుకి వెళ్ళి చిన్నపళ్ళెం తెచ్చాడు. రెండవ పాప ఒక్కోరకం మిఠాయి పెట్టింది. మూడవవాడు ఆప్యాయంగా తల్లి కందించాడు. బిడ్డలు ముగ్గుర్నీ హృదయానికి హత్తుకుంది సావిత్రి.

'నా కడుపు నిండిపోయిందర్రా...తండ్రులు—తల్లి!'

క్రచ్చున్ శబ్దంవిని ఆమె లేచి ఆ పళ్లెరాన్ని భర్త కందించబోయింది.

'నాకు అప్పుడే యిచ్చారు పిల్లలు...నువ్వు తిను....నీ కోసమేగా ఆమె తెచ్చింది ?'

ఆమె భర్త ముఖంలోకి నిర్లిప్తతతో చూచి నెమ్మదిగా లేచి వెళ్లిపోయింది.

ఆ చూపు అతని హృదయాన్ని దహించి వేసింది...'ఏం చెయ్యను? నేనేం చెయ్యను? అంగీకరించి సావిత్రికి తీరని అపకారం చేశానా?'

కడుపులో బిడ్డవయసు ఏడుమాసాలు.

సావిత్రి పెద్దకొడుకు టైఫాయిడ్‌తో మంచం పట్టాడు.

సావిత్రి రేయింబవళ్ళు తీరని వ్యథతో మంచం వదలకుండా కొడుకుని కనిపెట్టుకుని వుంది...

తన 'స్వంతం' అయినట్లయితే—ఇది త్రాగు, ఇది తిను—విశ్రాంతి తీసుకో—అని ఎవరైనా అన్నట్లయితే ఆమె అంత బాధపడేదిగాదు. ఎంతో సహజంగా వుండేది. ఇప్పుడు బిడ్డకోసం 'ఆ బిడ్డ భద్రతకోసం' అన్నమాటలు కుండలీకరణాల్లో వున్నట్లు భ్రమపడి బాధపడేది. ఏదో భయం తన్ను ఆవరించింది. ఇది గుర్తుకు రావటంతో ఆమెకు దుఃఖం ఆగేదికాదు.

పద్మకు తెలిసింది. రెక్కలు కట్టుకుని వాలింది.

సావిత్రికి పద్మను చూడటానికే మనసొప్ప లేదు.

ఆమె తల దువ్వుకోలేదు—బిడ్డ అనారోగ్యం ఆమెను కృంగదీసింది.

ముఖంలో కాంతిలేదు. నిస్పత్తువతో అడుగులో అడుగువేస్తూ వచ్చింది.

సావిత్రిని—ఆ విధంగాజూచి పద్మ తృళ్లిపడింది.

ఏదో మాట్లాడింది...సావిత్రి వినటం లేదు. ఆమె మనస్సంతా వికలమై పోయింది. పద్మ ఎప్పుడు వెళ్లునా—తను కొడుకు మంచం దగ్గరకువెళ్ళాలని ఆత్రపడుతోంది. పద్మ వెళ్లేట్లు లేదు! ఇక తాళి లాభం లేదు.

'పద్మగారూ—నా పెద్దకొడుక్కు సుస్తీగా వుంది. మీరు అన్యథా భావించక ఈ నాటికి సెలవు తీసుకుంటే మీాకు కృతజ్ఞురాలిని.'

పద్మ కళ్లు విప్పారినై. ఎ జీర తొంగి చూచింది!

సావిత్రి ఆమెను చూడదల్చుకోలేయ.

'వారం రోజులుగా మీా అబ్బాయికి సుస్తీగా వుందట...ఇన్నాళ్లు ఇదే విధంగా ఆందోళనతో మనః క్లేశంతో గడుపుతున్నారు? ...... సరైనభోజనంలేక వేళకు సరిగాతినకుండా మా కన్యాయం చేస్తారా? ఒక్కసారి అద్దంలో మీా ప్రతిబింబం చూచుకోండి. మీా ముఖమే న్యాయం చెబుతుంది!...మీారు...నా బిడ్డను...సరిగా...పోషించటం లేదు...'

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తోంది.

సావిత్రి ప్రమానుపడి తిలకిస్తోంది. కొన్ని క్షణాలకు రెండు చేతులతో గర్భాన్ని పట్టుకుంది. కన్నీరు కాల్వలు కట్టినై. వెక్కిళ్ళ మధ్య అంది: 'నేను తల్లిని...నా లోని ప్రతి అణువు బిడ్డక్షేమాన్ని కాంక్షిస్తోంది...డబ్బు...డబ్బుతో నన్ను కొనలేరు... ఇది వస్తువు...ఒక జడపదార్థం కాదు...నా కన్న కొడుకు మా యింటికి దీపం...జబ్బుతో పడు కుని వుంటే నన్ను...నన్ను...హాయిగా వుండమంటారా— ఏ కన్నతల్లినైనాఅడుగమ్మా చెబుతుంది......వ్యక్తిత్వాన్ని మాతృత్వాన్ని ధనంతో తూచే మీాకు...ఈ విషయాలు బోధపడవు...'

సావిత్రి నెమ్మదిగా లేచింది.

రమణి మెల్లగావచ్చి సావిత్రి భుజాల చుట్టూ చేయివేసింది.

'బాబుకెలావుంది సావిత్రీ!'

'మీారు...! మీా రెప్పుడు వచ్చారు...డాక్టర్ గారూ...' ఆమె మాట్లాడలేక పద్మవైపు నిశ్చలంగా ఒక్కక్షణం చూచి లోపలికి వెళ్ళిపోయింది.

డాక్టర్ రమణి పద్మను నిశ్చల దృక్కులతో తిలకించి నెమ్మదిగా ఆమెను సమీాపించింది. పద్మ తలవంచుకుంది.

'పద్మా—మీారీ విధంగా అనుక్షణం ఆమెను బాధిస్తారనుకోలేదు. నేను మీా కనేక పర్యాయాలు బోధపరచాను. మీా బిడ్డ అయినప్పటికీ ఆమె కడుపులో ఆమె బిడ్డగా పెరగాలి. ఆమె తన స్వంత బిడ గర్భంలో వుండేటప్పు డేవిధమైన సాధకబాధకాలు, సమస్యలు కష్టాలను ఎదుర్కుంటుందో అలాంటి వాతావరణంలోనే ఆమె మసలుతుంది కనుక—మీారు— సావిత్రిని అన్నిటికి అతీతంగా ఒక యంత్రంలా వ్యవహరించాలని కోరటం వట్టి అనాలోచిత క్రియ. ఆమెను వదలివేయండి...మీాకు బిడ్డలు పుట్టిన తర్వాత అన్నీ తెలియవచ్చు...కానీ మీనించి నేను ఈ ప్రవర్తన కోర లేదు. సావిత్రిని తనపాటికి తనను స్వేచ్ఛగా వదిలి వేస్తారనుకున్నామేగాని ఆమె ప్రతిక్రియకు అంక్ష విధిస్తారని కలలోకూడా అనుకోలేదు...సావిత్రిని ఇంత ఇరకాటంలో పడేస్తామనికూడ మేము ఊహించలేదు.'

పద్మ వెళ్లిపోయింది.

సావిత్రికి నెలలు నిండిన కొద్ది అనుమానాలు! భయాలు! బిడ్డ సరిగ్గా పుడతాడా? తను ఆరోగ్యవంతురాలు. తను సులభంగానే ప్రసవిస్తుంది కానీ...ఈసారి......ఏ విధంగా వుంటుంది? బిడ్డ ఏ అవలక్షణం లేకుండా పుట్టాలి—కానీ...ఆలాపుడితే అది తన తప్పుక్రింద జమకట్టి తనను దూషిస్తే? నువ్వు సరిగా లేవు...ఏవో చింతలతో—సమస్యలతో సతమతమైపోతూ నా బిడ్డ కన్యాయం చేశావంటే— తనేం చెయ్యగలదు? ఎన్నో విధమైన శంకలతో ఆమె మనసు వికలమైపోయేది.

ఆ రోజు రానే వచ్చింది.

పండువంటి మగబిడ్డను ప్రసవించింది.

కేర్ మన్న కేకతో ఉలిక్కిపడి కళ్లు తెరిచింది.

పద్మ బిడ్డను సావిత్రిప్రక్కలో పరుండజేసి ప్రక్కగా కుర్చీలో కూచుంది. రమణి వచ్చేసరికి సావిత్రి బిడ్డను ఆప్యాయంగా నిమురుతోంది. ఆ చిన్నారి నుదుటిపై లీలామాత్రంగా అగుపించే చారలను సవరిస్తూ, చూపుడు వ్రేలుతో నుదురు

రాస్తూ - బుగ్గల్ని సుకుమారంగా నొక్కుతూ తన్మయురాలై బాహ్య ప్రపంచాని కతీతురాలై వుంది.

రమణి కళ్ళు చెమర్చాయి.

పద్మ దీర్ఘంగా నిశ్వసించి ఎటో చూస్తోంది.

తొమ్మిది రోజులు కాలచక్రంలో కలిసిపోయాయి.

పద్మ రోజంతా ఇంట్లో వుండక తప్పింది కాదు.

రమణి బలవంతంపై సావిత్రి దగ్గఱ బాబును వదలక తప్పలేదు. వారిద్దరికి ఏకాంతం కావాలట—సావిత్రికి ఆ బిడ్డమధ్య అవినాభావ సంబంధం వుంది. అది అనిర్వచనీయమైనది. ఈ బాంధవ్యాన్ని త్రుంచివేసి నాశనం చేయగంశక్తి ఎవ్వరికీ లేదట. ఈ కొద్ది రోజులు వారిని ఒంటరిగా వదలి తాను దూరంగా వుండాలట...పద్మ అయిష్టంగానే దూరంగా వుంది. కొడుకును చూడాలని—పొదివి పట్టుకుని హృదయానికి హత్తుకోవాలన్న బలవత్తరమైన కోర్కెను అతిప్రయాసతో అణచుకుంది. ఒకసారి వెళ్ళిందికూడ—కానీ ఆమె ఐదు నిమిషాలకన్నా ఎక్కువ వుండటానికి వీల్లేకపోయింది.

ఈ రోజు ఇరవై ఒకటవ రోజు.

పద్మ వాళ్ళ గృహం బంధుమిత్రులతో—పచ్చతోరణాలతో—అత్యంతము సందడిగా సుందరంగా కలకలలాడుతోంది.

పద్మ, ఆమె భర్త గుమ్మందగ్గఱ ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు.

కారు ఆగింది.

సావిత్రి సావతో దిగింది. ఆమె విలువైన పట్టుచీర కట్టుకుంది. బాలింతరాలు - నిండుగా హుందాగా దిగింది, గానీ ఆమె ముఖంలో చీకటి చ్ఛాయలు. వెనువెంట భర్త నెమ్మదిగా దిగాడు. దంపతులను సాదరంగా ఆహ్వానించి దిష్టి తీసేశారు.

పద్మ అత్తమామలు దూరంనించి ఆనంద భరితులై తిలకిస్తున్నారు!

సావిత్రి భర్తప్రక్కను పీటమీద కూర్చుంది.

ఆమె ఒడిలో బాలుడు నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

వాతావరణం స్తంభించిపోయింది.

బిడ్డ ముమ్మూర్తులా పద్మలా వున్నాడు!

అందరూ ఆశ్చర్యంతో చూస్తున్నారు.

రమణి ముకుందరావులు ముందుకొచ్చారు.

పద్మ పెద్ద వెండి పళ్ళెరంలో రూపాయలు నిండుగాపోసి పండ్లు, పువ్వులు, తాంబూలం, కొబ్బరికాయ పెట్టుకుని వచ్చి నుంచుంది.

రమణి పద్మవైపు వింతగా చూచింది.

సావిత్రి రమణిని చూస్తోంది... 'ఆ క్షణం వచ్చింది—భరించక తప్పదా?' అన్నట్లు తిలకిస్తోంది.

ఆమె హృదయం అల్లకల్లోలమై గిలగిల కొట్టుకుంది.

ఆ క్షణంలో పద్మముఖం ఆనందంతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ప్రశాంతమైన ఆమె ముఖం హృదయ నైర్మల్యాన్ని ప్రతిఫలింప జేస్తోంది!

రమణి ఏదో చెప్పటానికి నోరు తెరచిందిగానీ వ్యవధిలేక పోయింది.

పద్మ ఆ పళ్ళాన్ని సావిత్రి కందించి బదులుగా ఒడిపట్టింది.

సావిత్రి తట్టక్రిందపెట్టి భర్తవైపు చూచింది.

అతని ముఖం ప్రశాంతంగా వుంది.

సావిత్రి చటుక్కున బిడను చేతుల్లో తీసుకుని గాఢంగా ముద్దుపెట్టుకుంది. బిడను ఆశీరదిస్తున్నట్లు అశ్రువులు జలజల రాలాయి.

పద్మ దగ్గఱగావంగి ఒడిపట్టింది...

'మీరు...బాబుకు...పెదతల్లి—పెదతండ్రి... మీకు బాబును చూడాలనుకున్నప్పుడు ... ఎప్పుడైనా రావచ్చు...మీకోసం...మా తలుపులు...సదా...తెఱువబడివుంటాయి. ఇంతటితో... మన...బాంధవ్యం తెగినదని అనుకోకండి.'

ఆమె కంఠం పూడుకుపోయింది. అశ్రుభరిత నేత్రాలను తుడుచుకోటానికి ఆమె ప్రయత్నించలేదు.

సావిత్రి ఇక జాగుచేయలేదు. చటుక్కున బిడ్డను ఆమె ఒడిలోవుంచి ఆప్యాయంగా నుదురు నిమిరింది.

చుట్టూ నుంచున్న వారి కళ్లు చెమర్చాయి. ఆ దృశ్యం అందరి హృదయాలను తట్టింది.

రమణి మౌనంగా వుండలేకపోయింది. పద్మకు దగ్గఱగా వచ్చి 'పద్మా...మీరేనా అంట··ఇలామాట్లాడింది...నాకు చాలా సంతోషం...ఈ గడియను ఎలా భరించాలోనని భయపడిపోయాను...మాకు సంతోషమైంది...మా పని పరిపూర్ణమైంది...ఒక్కమాట... మీరు నిజంగా మారిపోయారు...ఎలా సాధ్యమైంది?'

పద్మ నవ్వింది.

'ఈ ఇరవై ఒక్కరోజులు నాకు కనువిప్పు కల్గించాయి. తల్లి హృదయం ఎటువంటిదో అప్పుడర్థమైంది...ఈ దినాల్లో నాకు...భోజనం సహించలేదు...ఎక్కడికి వెళ్ళాలనిపించలేదు. నా హృదయాన్ని బాబుమూర్తి ఆవరించింది. వాడు కళ్లలో మెదిలేవాడు. నా ప్రతి అణువు బిడ్డకోసం తహతహలాడిపోయేది...ఆలోచించే దాన్ని...ఈ ఎడబాటు సావిత్రిగారికి ఎంత సహింపరానిదో ఊహించగల్గాను... అక్కయ్యా—సావిత్రీ...నా తప్పులు మన్నించి అనుగ్రహించండి' అంటూ రెండు చేతులు జోడించింది.